క్లుప్తంగా

లలితా దీక్షలు ప్రారంభం



స్వామీజీ చేతుల మీదుగా లలితా దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో సంక్రాంతి రోజున లలితా దీక్షలు ప్రారంభమయ్యాయి. మాఘ పౌర్ణమి వరకు 21 రోజుల పాటు దీక్ష కొనసాగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యుడు సత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు అమ్మవారి దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్ట దళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

18న సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1,500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న పైల దివాకర్ ఫౌండేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: పైల శివతేజ వర్ధంతి సందర్భంగా పైల శివతేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే న్యూకాలనీ షిర్డీసాయి బాబా ధ్యాన మందిరం వద్ద అన్నార్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైల దివాకర్ మాట్లాడుతూ తన ఏకైక కుమారుడు పైల శివతేజ ప్రమాదవశాత్తు మరణించి పదేళ్లు పూర్తయిందని, తన జ్ఞాపకార్థం ప్రతి ఏటా జయంతి, వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం, చేస్తూ, పలువురు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సత్య, మహారాణా, చిరంజీవి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

సీతమ్మధార: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం చాకలిపేటలో రాజు, పద్మజ దంపతులు నివసిస్తున్నారు. సంక్రాంతి పండక్కి సమీపంలోని కన్నవారి ఇంటికి వారు వెళ్లారు. భార్య పద్మజ నిత్యం సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఉండటంతో భర్త రాజు ప్రశ్నించాడు. దీంతో ఆమె సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లకు రాజు వెళ్లి అడగ్గా.. కనిపించలేదని చెప్పడంతో ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అతడు చేసిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరసల కోలాహలం



గవర కంచరపాలెం పరసలో దుకాణాల వద్ద సందడి

- సంక్రాంతి సీజన్‌లో.. ఆనవాయితీగా నిర్వహణ
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు

కంచరపాలెం: నగరంలో పరసల కోలాహలం మొదలైంది. ఏటా సంక్రాంతి పండగ సీజన్‌లో పరసలు జరగడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో తీర్థాలుగా వ్యవహరించే వీటిని శ్రీరామలీలా పరసల పేరిట ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు. నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ పరసలు కనిపిస్తుంటాయి. సంకాంత్రి రోజున కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో, జాషువా కళా ప్రాంగణంలో, కనుమ రోజున గవర కంచరపాలెం, ముక్కనుమ రోజున రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల్లో పరసలు నిర్వహిస్తారు. నగరంలోని మర్రిపాలెం, కరాసా, తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, అల్లిపురం తదితర ప్రాంతాల్లో పరసలు జరుగుతున్నాయి.

సందడే సందడి..

పరసల్లో ఏర్పాటు చేసే దుకాణాల వద్ద పిల్లలు, పెద్దలు సందడి చేస్తుంటారు. ఆటబొమ్మలు, ఖర్జూరం, పంచదారచిలువలు, పానీపూరీ, హల్వా, హాట్‌చాట్, ఐస్‌క్రీం వంటి తినుబండారాలు, గృహోపకరణాలు, వివిధ రకాల సామగ్రి మొదలైనవి విక్రయిస్తారు. పులివేషాలు, తప్పెటగుళ్లు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. వీటిని నమ్ముకునే కళాకారులకు పరసలు కొంత వరకూ ఉపాధినిస్తాయి.

నేడు ఆర్పీ పేటలో..

సంక్రాంతి సంబరాలు పూర్తవక ముందే కంచరపాలెం, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం ప్రాంతాల్లో పరసల సందడి మొదలైంది. శివరాత్రి వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో వీటి కోలాహలం కనిపిస్తుంది. సాముగారెడీ, తప్పెటగుళ్లు, కోలాటం వంటి జానపద కళా ప్రదర్శనలు జరుగుతాయి. సోమవారం జాషువానగర్ ప్రసన్న వినాయక ఆలయంలో, మంగళవారం గవర కంచరపాలెం అభయాంజనేయ ఆలయంలో, బుధవారం రామ్మూర్తిపంతులు పేటలో, గురువారం కొత్తరెడ్డి కంచరపాలెంలో, ఆదివారం 104 ఏరియా, మర్రిపాలెం ప్రాంతాల్లో వేర్వేరుగా పరస ఉత్సవాలు నిర్వహిస్తారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వినాయకుడు

ఘనంగా ప్రసన్న వినాయక తీర్థ మహోత్సవం

కంచరపాలెం జాషువానగర్‌లో గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గుమ్మిడి అచ్చిబాబు పర్యవేక్షణలో సోమవారం ప్రసన్న వినాయక తీర్థ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముఖ్య అతిథులు మాజీ కార్పొరేటర్లు కొప్పల వెంకటరావు, బొట్టా ఈశ్వరమ్మ, టీడీపీ మహిళా నాయకురాలు ఈతలపాక సుజాత, ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎం.కొండబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాయిత పైడి రత్నాకర్, జామి కరుణ భజన చెట్టు వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పరస వేడుకలు ప్రారంభించారు. గొల్ల కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతీయులు ప్రదర్శించిన సాము గరిడీలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ వినాయక ఆలయంలో అర్చకుడు వరహగిరి జగదీష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏడు గ్రామాల సఖ్యతను చాటి చెప్పే భజన చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంఘ గౌరవ అధ్యక్షుడు గొటువాడ నరసింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి(ఆదిబాబు) పాల్గొన్నారు.



ప్రసన్న వినాయకుడి ఆలయంలో భజన చెట్టు వద్ద జ్యోతి వెలిగిస్తున్న అతిథులు



జాషువానగర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు

సందడిగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో హరిదాసు, నిర్వాహకులు, స్థానికుల సందడి

కంచరపాలెం: సంప్రదాయాలకు ప్రతీకలుగా పండగలు నిలుస్తాయని దళిత మహిళా నాయకురాలు సుజాత ఈశ్వరావు అన్నారు. కంచరపాలెం పరిధి యల్లబిల్లివారి వీధి గంగన్ననగర్‌లో సంకాంత్రి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పల్లె వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగు రంగుల రంగవల్లులతో రహదారులు అందంగా మెరిసిపోయాయి. ముందుగా భోగి మంటలు వేసి సంప్రదాయ పండగల విశిష్టతను పిల్లలకు తెలియజేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి.

కనుమ వేళ.. నాన్‌వెజ్‌కు డిమాండ్



సీతమ్మధారలో మటన్ షాపు వద్ద జనం



నక్కవానిపాలెంలో నాటుకోళ్లు కొనేందుకు వచ్చిన వినియోగదారులు

- చికెన్, మటన్ దుకాణాలు కిటకిట

సీతమ్మధార: సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. మంగళవారం కనుమ కావడంతో సీతమ్మధార, నక్కవానిపాలెంలోని ప్రధాన రహదారిలో గల నాటుకోడి మాంసం దుకాణాల వద్ద ప్రజలు ఉదయం నుంచి క్యూ కట్టారు. వినియోగదారులు భారీగా వచ్చి కొనుగోలు చేశారు. సంక్రాంతి అనంతరం కనుమ పండగ నాడు.. ప్రతి ఇంట్లో గారెలు, బిర్యాని, నాటుకోడి మాంసంతో బంధుమిత్రులకు భోజనాలు పెడతారు. దీంతో సీతమ్మధారలోని మాంసం దుకాణాలన్నీ జనంతో కిటకిటలాడాయి.

స్నేపర్ పార్కు సందర్శన వేళలివే..



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో స్నేపర్ పార్కు

సీతమ్మధార: నగరానికి మరింత వన్నె తెచ్చేలా జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రూ.2.5 కోట్లతో స్నేపర్ పార్కును నిర్మించి ఇటీవల ప్రారంభించారు. ప్రజలు సేద తీరేలా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌లు నాలుగు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, పెర్గోలా నాలుగు, లిల్లీపాండ్, పెవిలియన్, టాయిలెట్లు, గెజిబో, ధ్యానం, యోగా కేంద్రాలు, యాంపీ థియేటర్ ఏర్పాటు చేశారు. ఉదయం 4 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు స్నేపర్ పార్కును సందర్శించవచ్చు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, ఈస్ట్ పార్కు ఏరియా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పార్కును నిర్వహిస్తున్నారు.

మాజీ సైనికులకు ఘన సత్కారం



ఆర్మీ సైనికులను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో మిలటరీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో పనిచేసిన మాజీ సైనికులను క్లబ్‌కు ఆహ్వానించి వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్వీస్‌లో వారు నేర్చుకున్న క్రమశిక్షణ, నిజాయతీ, దేశభక్తి, వారి అనుభవాలను చక్కగా వివరించారు. దేశం కోసం ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలందించిన సైనికులను సత్కరించుకోవడం మన బాధ్యతని ప్రభావతి అన్నారు. క్లబ్ పూర్వ గవర్నర్ శుభ, కార్యదర్శి ఎం.జయ, సభ్యులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో గోపూజ



గోవుకు మేత తినిపిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్ బోర్డు సభ్యులు

సింహాచలం: కనుమ పండగను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పసుపుకుంకుమలు సమర్పించారు. శ్రీకృష్ణుడి విగ్రహం చెంతన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీకృష్ణాష్టకం పఠించి విశేషంగా హారతులు అందజేశా రు. దేవస్థానం అర్చకుడు సంతోష్‌శర్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు



అప్పన్న ఉత్సవమూర్తుల చెంతన పాశుర విన్నప పఠనం చేస్తున్న స్థానాచార్యులు, అర్చకులు



మేళతాళాల మధ్య స్వామి, అమ్మవార్లను తిరువీధిగా తీసుకొస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ధారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిని,గోదాదేవి ఒక పల్లకీలో, మదన గోపాలస్వామిని వేరొక పల్లకీలో అధిష్ఠింపజేశారు. సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారిని, ఆళ్వారులను మకో పల్లకీలో వేంచేయజేసి మేళతాళాల మధ్య ఆలయం నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేషంగా స్నపనం నిర్వహించారు. అనంతరం గంగధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామిని, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. పాశుర విన్నప పఠనం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్,ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు,అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భజన చెట్టుకు పూజలు

సీతమ్మధార : మంగళవారం జీవీఎంసీ 27వ వార్డు పరిధిలోని దొండపర్తిలో రామాలయం భజన చెట్టు పలు వీధుల్లో తిరిగింది. ఈ సందర్భంగా భక్తులు రాముల వారికి పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. దొండపర్తిలోని కుప్పిలివారివీధి, భాగివారి వీధి, మండావారి వీధి, పాలికలవారి వీధి, నెహ్రూ బజార్ ప్రాంతంలో భజన చెట్టును స్థానికులు దర్శించుకుని రాముల వారికి పూజలు చేశారు.

పోలీసుల అదుపులో ఆరుగురు జూదరులు

- రూ.95,550 నగదు స్వాధీనం

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సాయిసాధా అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.95,550 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు.

నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటి వరకు వాటిని ప్రారంభించకుండా తాళాలు వేసి ఉంచడంతో వాటర్ ట్యాంక్ పాడైపోవడంతోపాటు రేకులకు తుప్పు పడుతోంది. స్థానికులు టాయిలెట్ల వద్దకు వెళ్లి చూసేసరికి తాళాలు వేసి ఉండటంతో వెనుదిరుగుతున్నారు. వెంటనే మరుగుదొడ్లు తెరవాలని కోరుతున్నారు.

సామాన్యుల సేవలో మాస్టర్ ఈకే సంస్కృతి సదన్



ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సిహెచ్.ఎస్.ఎన్.రాజు, సత్యదేవ్, బి.ఆర్.కె.రాజు

మహారాణిపేట: సామాన్యులకు తన వంతు సేవలందించడమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రధాన ఆశయమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. 30 ఏళ్లుగా పీఠం చేసిన సేవల వివరాలతో కూడిన సావనీర్(ప్రత్యేక సంచిక)ను అంకోసా ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఆధ్యాత్మిక, సేవా సంస్థలకు మార్గదర్శకత్వం వహించిన మాస్టర్ ఈకే పార్వతీకుమార్ సత్సంకల్పానికి ప్రతిరూపమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ అని పేర్కొన్నారు. 1994లో డాక్టర్ టి.వి.వి.ఎస్.రావు నేతృత్వంలో తాటిచెట్లపాలెంలో మాస్టర్ హోమియో వైద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మందికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు 444 మందికి ఉచిత విద్యనందించినట్లు చెప్పారు. సంస్కృతీ భవన్ నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, దాతలు, కార్యకర్తలకు సత్యదేవ్ కృతజ్ఞతలు తెలిపారు జగద్గురు పీఠం సలహా మండలి సభ్యుడు సిహెచ్.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ బాలవికాస కేంద్రంలో 324 మంది చిన్నారులకు ప్రవేశం కల్పించామన్నారు. సంగీత జనకులం ద్వారా కూడా సేవలందిస్తున్నామని చెప్పారు. ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.వి.ఎస్.మూర్తి, నిర్వాహక సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, యు.సి.హెచ్.బి. వర్మ, సర్కిల్ ఆఫ్ గుడ్ విల్ కార్యనిర్వాహక సభ్యుడు జి.వి.ఎన్. హరి, బి.ఆర్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మకరజ్యోతి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయంలో మకరజ్యోతి పూజలు ఘనంగా నిర్వహించారు. కేరళలో గల శబరిమల అయ్యప్పస్వామి దేవస్థానంలో జ్యోతి దర్శనం సందర్భంగా ప్రతి ఏడాది పూజలు నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా అయ్యప్ప స్వామికి విశేష పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు భార్గవశర్మ చేపట్టారు. అయ్యప్పస్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. హారతి జ్యోతిలో అయ్యప్పను దర్శించుకున్న భక్తుల శరణం శరణుగోషతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్, గురుస్వామి నీలాపు వెంకట రమణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జోష్ నింపిన సంప్రదాయ నృత్యాలు



శిల్పారామంలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. ప్రత్యేక ఆకర్షణగా పల్లె జీవన విధానాన్ని ప్రతిబింబించే సంప్రదాయ నృత్యాలు నిలిచాయి. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని సోమవారం శ్రీ సిద్ధేంద్ర యోగీ నాట్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి , జానపద నృత్యాల ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. సంక్రాంతి పండగ ముఖ్య అంశంగా రూపొందించిన నృత్య రూపకం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. కళాకారులు యశ్మిత,పద్మ,సారిక,వేదిత తదితరులు కార్యక్రమాన్ని రక్తి కట్టించారు.

కనుమ రోజున.

జోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన నృత్యాలు అదరహో అనిపించాయి. రామ శబ్దం,నోమి నోమిన్నాలో, ఏరువాకా సాగారో తదితర గీతాలకు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమాలను స్థానిక పరిపాలనాధికారి విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.

మందుబాబులు, పేకాటరాయుళ్లకు అడ్డా



రాధాకృష్ణ లేఅవుట్‌లోని కొండ ప్రాంతం

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు రాధాకృష్ణ లేఅవుట్‌లోని కొండ ప్రాంతం మందుబాబులు, పేకాటరాయుళ్లకు అడ్డాగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మందుబాబులతో ఈ ప్రాంతం గందరగోళంగా మారుతోంది. ఈ ప్రాంతంలో పలు కుటుంబాలు నివసిస్తున్నాయి. సాయంత్రమైతే చాలు పదుల సంఖ్యలో బ్యాచ్‌లుగా ఇక్కడికి వచ్చి మద్యం మత్తులో ఊగుతూ.. తాగుతూ వెళ్తుంటారు. ఆ సమయంలో బయటకు రావాలంటే ఇబ్బందికరంగా ఉందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

19న 'మా రామయ్య' గీతం విడుదల

మద్దిలపాలెం: అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న యూట్యూబ్‌లో అయోధ్యకు వచ్చేనయ్య.. మా రామయ్య గీతాన్ని విడుదల చేయనున్నట్లు యూట్యూబర్ అభిషేక్ తెలిపారు. ప్రస్తుతం విశాఖ పరిసర ప్రాంతాల్లో ఈ పాటను చిత్రీకరిస్తున్నామన్నారు. పెదవాల్తేరు రామలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో మంగళవారం రామయ్య పాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నిమిషాల నిడివి గల ఈ పాటను ఆరిలోవ తోటగరువు కృష్ణుడి మందిరం పరిసరాల్లో చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు. భార్గవ్ మాట్లాడుతూ ఆరవ్ ప్రొడక్షన్ బ్యానర్‌లో తెలుగు, హిందీ భాషల్లో ఈ పాటను విడుదల చేస్తున్నామన్నారు. దసరాకు ఒక పాట విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు.